# భయం

దాసు కాగితాల్లో తలదూర్చి పనిలో పూర్తిగా మునిగిపోయి వున్నాడు. అతనికి అప్పగించిన పని అలాంటిది మరి. అది అర్జంట్‌గా మర్నాటికల్లా పూర్తయి తీరాలి. నిజానికది నాలుగురోజులు రాత్రింబవళ్ళు చేస్తేగానీ కాదు. కానీ, పరిస్థితి అలాంటిది. మేనేజరు ప్రత్యేకంగా దాసుని పిలిచి, పని అప్పగించాడు.

"నిజమే. దాసూ ! ఈ స్టేట్‌మెంట్ తయారుచెయ్యడానికి రెండు రోజులైనా చాలదు. కానీ మనకిది రేపు సాయంత్రానికి రెడీ చేసుకోకపోతే కుదరదు."

"మరి."

"దాసూ ! నువ్వే చెయ్యగలవు. అందుకే నీకు చెప్పాను. "మేనేజరు

గొంతులో దాసుకి ఎన్నో వాగ్దానాలు ధ్వనించాయి. ఎన్నాళ్ళగానో తను అడుగుతున్న జీతం పెంపుదల అతనికి గుర్తుకొచ్చింది. ఆశగా అనిపించింది.

అందుకే సరే అన్నాడు. అందులో వంచిన తల ఎత్తకుండా మునిగిపోయాడు. అంకెలు కూడుకుంటూ, తీసివేస్తూ, భాగారిస్తూ పర్సంటేజీలు కడుతూ, పైసలు లెక్కేస్తూ ఎలక్ట్రానిక్ కాలిక్యులేటర్‌మీద చకచకా సాగిస్తున్నాడు పని.

ఆ రోజు ఉదయం రోజు కన్నా గంట ముందుగా వద్దామనుకున్నాడు కానీ రావాల్సిన దానికన్నా అరగంట లేటుగా వచ్చాడు.

ఉదయం ఆఫీసుకి బయలుదేరేముందు సుభద్రకి విపరీతంగా కడుపులో నొప్పి వచ్చి విలవిల్లాడిపోయింది. చూస్తూ చూస్తూ రాలేక, వీధి చివరనున్న డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి మందు యిప్పించి వచ్చేసరికి ఆలస్యమైపోయింది. అంతట్లో మేనేజర్ ఒకసారి పిలవనే పిలిచాట్ట.

దాసు ఎంత వేగంగా పనిచేసుకుపోతున్నా ఏవో కొన్ని ఆలోచనలు అంతర్లీనంగా సాగుతూనే వున్నాయి.

అన్నగారి దగ్గర నెల్లూరులో వుండి చదువుకుంటున్న కొడుకు శ్రీరామ్ గురించి ఆలోచిస్తూనే వున్నాడు. ఆంధ్రదేశానికి యింత దూరంలో పెద్దపట్టణంలో తనున్నప్పటికీ, ఇక్కడి చదువు సంధ్యలు బాగుండవని అన్నయ్య తన దగ్గర పెట్టుకున్నాడు వాడ్ని ఇక్కడ తనూ, భార్యా ఆడపిల్లతో కలిసి వుండేసరికే అంతంత మాత్రంగా వుంది. ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం - క్షణం తీరిక లేని ఈ ఉద్యోగ ధర్మం! ఇలాంటి సమయాల్లో తన తెలివితేటల్ని, కష్టాన్ని బాగా వాడుకుంటారుగానీ, ప్రతిఫలం యివ్వాల్సి వచ్చేసరికి వెయ్యి లెక్కలు కట్టుకుంటారు.

దాసు మెదడులో ఒక భాగం చురుకుగా పనిచేసుకుపోతూనే వుంది.

ఎవరో వచ్చి తన టేబులు దగ్గర నిలబడినట్లయి, దాసు తలెత్తి చూశాడు. ఎదురుగా వరహాలు. అబ్బ ఏనాటి వరహాలు! ఏనాటి మాట! ఒక్కసారి తను పుట్టి పెరిగిన వూరు కళ్ళ ముందు గిర్రుమని తిరిగింది. ఎక్కడ్నించి ఊడిపడ్డాడు అకస్మాత్తుగా. అవును. ఇక్కడే ఎక్కడో వుంటున్నట్లు చెప్పాడామధ్య. తను కలిసీ చాలా కాలమైంది. ఈ సమయంలో వరహాలు రావడం కొంచెం యిబ్బందిగా అనిపించినా ఏనాటివాడో, చిన్ననాటి మిత్రుడు, తన వూరివాడు కావడం వల్ల దాసు ముఖంలో ఆనందమే కొట్టొచ్చినట్టు కనబడింది.

"ఏమిటిలా వచ్చావ్" అన్నాడు ఆప్యాయంగా అతని చేతినందుకుంటూ.

"ఓ చిన్న పనుండి వచ్చాను. ఒక్కసారి పది నిముషాలు బయటకి రా" అన్నాడు వరహాలు.

దాసు ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

"పర్లేదు. ఇక్కడే మాట్లాడుకుందాం" అన్నాడు.

"నో. నో .... వెంటనే రా మళ్ళీ ఓ పది నిముషాల్లో వచ్చేద్దువుగాని" అన్నాడు వరహాలు.

ఏమైనా మాట్లాడాలా ! "

"రద్దూ. పర్లేదు. ఇప్పుడే వచ్చేద్దువుగానీ" -

దాసు అటూ యిటూ చూశాడు. ఉదయం వచ్చినప్పటినుంచి సీట్లోంచి కదల లేదు. వరహాల్ని మరీ తిరస్కరించలేక బయటకి కదులుతూ చాలా ఇంపార్టెంట్ వర్క్ వుంది. వెంటనే వచ్చెయ్యాలి" అన్నాడు తనలో తను అనుకున్నట్లుగా.

వరహాలు గబగబా అడుగులు వేశాడు. దాసు అతన్ని అనుసరించాడు.

ఒక రెండు నిముషాల్లో ఇద్దరూ లిఫ్ట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌కి వచ్చేశారు అనుకున్న దానికంటే వేగంగా వాళ్ళు ఆ ఏడంతస్తుల భవనం గేటు దాటారు. అక్కడంతా ఒకటే జనం ఎవరి గురించి ఎవరికీ పట్టదు. మంచి బిజినెస్ టైము. ఎవరి గొడవలో వారున్నారు.

"వరహాలూ ! ఏమిటా హడావిడి ? ఏమిటా పరుగు" అన్నాడు దాసు.

"అబ్బే. పరుగేం లేదు నువ్వు త్వరగా వచ్చెయ్యాలన్నావుగా ఓ మాంచి చాయ్ తాగుతూ మాట్లాడుకుందామనీ" - వరహాలు ముఖంలో నవ్వు.

ఆటోలో ఇద్దరూ దగ్గరలోని సెంటర్‌లో వున్న రెస్టారెంట్ దగ్గర దిగారు. బిస్కట్లు తిని టీ తాగారు దాసు ఎప్పుడో తిన్న తిండి, కడుపులో ఆహారం పడగానే వుషారు వచ్చింది.

"ఇప్పుడు చెప్పు ఏంటీ కబుర్లూ" అన్నాడు దాసు.

"ఏముంది ? ఊరికే - నిన్ను చూద్దామనిపించింది. వచ్చాను"

"నిజానికీవేళ చాలా బిజీగా వుంది. ఇదే రేపైతే మనం యింకాస్త హాయిగా ఫ్రీగా వుండేవాళ్ళం" అన్నాడు దాసు.

వరహాలు నవ్వాడు.

ఇద్దరూ ఏవేవో చిన్ననాటి కబుర్లూ, వాళ్ళ ఊరి కబుర్లూ చెప్పుకున్నారు. అవన్నీ తలుచుకుంటుంటే దాసుకి ఆనందంగా అనిపించింది.

"నేను చెర్లో మునిగి కొట్టుకుపోతుంటే నువ్వు ఈత కొట్టుకుంటూవచ్చి నన్ను రక్షించావు గుర్తుందా" అన్నాడు వరహాలు.

"అబ్బా ! నీకింకా గుర్తుందా ఆ సంగతి" అన్నాడు దాసు ఆశ్చర్యంగా.

వరహాలు నవ్వి. వాచీ చూసుకున్నాడు. దాసు కూడా టైము చూసుకుని "మరిక వెళ్తాను" అన్నాడు. ఒక్క క్షణం ఆగి "సరే - మళ్ళీ కలుద్దాం" అంటూ వరహాలు వేగంగా వెళ్ళిపోయాడు. అప్పటికే అనుకున్న దానికంటే ఎక్కువ టైమే అయిందనీ దాసు కూడా రెండడుగులు వేసి ఆటో పిల్చాడు.

దూరంగా పెద్దగా మంటలు, పొగలు - హాహాకారాలు. జనం ఎదురుపరు గెట్టుకొస్తున్నారు. ఆటో డ్రైవరు ఆపి వాకబు చేశాడు.

"........ భవనంలో బాంబులు పేలాయి. బిల్డింగ్ కూలిపోయింది. గోలగా వుంది." -

ఒక్కసారి దాసు గుండె ఆగి మళ్ళీ కొట్టుకోవడం మొదలు పెట్టింది - అతి వేగంగా - మరీ వేగంగా అతని గుండె కొట్టుకుంటోంది.

దాసు ఒక్క ఉదుటున ఆటోలోంచి దూకి పరుగు లంఘించుకున్నాడు. ఎంత వెర్రిగా, ఎంత ఆవేశంగా, ఎంత భయంతో అతను పరుగెడుతున్నాడో అతనికే తెలీదు. అతన్నీ, అతని పరుగునీ పట్టించుకునే స్థితిలో ఎవ్వరూ లేరు. బరువెక్కిన గుండెలతో అతనక్కడికి చేరాడు. అవును. అదే భవనం - అరగంట క్రితం అందులో అయిదో అంతస్తులో కూర్చుని అతను పనిచేసిన భవనం. కూలి పోయింది. మంటలు రేగుతున్నాయి. జనఘోష ఆకాశాన్నంటుతోంది. చెవులు చిల్లులుపడే శబ్దం. గుండెలాగిపోయే భయం.

దాసుకి ఒక్కసారి బుర్ర శూన్యంగా అయిపోయింది. గుండె బరువెక్కి పోయింది. అతనికి కళ్ళు తిరిగిపోయాయి. తృటిలో తప్పిన మరణం అతన్ని గజగజలాడించింది. అతనక్కడే అలాగే కుప్పకూలిపోయాడు.

*   *   *

దాసు భార్య కమల. ఇరవైగంటలుగా తిరిగిన హాస్పత్రి తిరక్కుండా తిరిగి, వెదకి ఆమె భర్త వున్న హాస్పత్రిని కనుక్కుని అరనిముషమైంది. ఆమె

భర్త బి. కె. దాస్ అక్కడ ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్నాడని తెలిసింది. ఆమె గుండె బద్దలయేందుకు సిద్ధంగా వున్న అగ్నిపర్వతంలా వుంది. కన్నీరై లావా బయటకి ప్రవహిస్తోంది.

మనిషి బతికేనా ? బతికినా కాలుపోయి, చెయ్యిపోయి, కళ్ళుపోయి -, ఓరి భగవంతుడా ! ఏమిటీ పరీక్ష. అసలు ఈ బాంబులు పేలడ మేమిటి ? ఏ పాపమూ ఎరుగని ఈయనకి దెబ్బలు తగలడ మేమిటి ? ఏమిటీ ఖర్మ, ఇప్పుడు నేనేం చెయ్యాలి ?

వీళ్ళు అసలు నన్నెప్పుడు లోపలికెళ్ళనిస్తారు ? ఏ మడిగినా ఎవ్వరూ స్థిమితంగా చెప్పరేం ? ఈ కుంటి మనిషితో - ఈ గుడ్డి మనిషితో ఇంకా ఇంకా నేనెలా బతుకుతాను ? ఎలా యీ బతుకీడ్వాలి ?

ఎప్పుడూ చీమక్కూడా అపకారం తలపెట్టని మనిషే ! !

కమల ఆలోచనలు హద్దుల్లేకుండా పరుగెడుతున్నాయి. ఆమె ఎంతసేపలా కూర్చుందో శోకదేవతలా చివరి కొచ్చిందామెకి పిలుపు.

కమల భర్తని చూసి ఆశ్చర్యపోయింది. అంతలోనే గుండెపగిలే ఆనందం ఆమెని వూపేసింది దాసు వంటిమీద చిన్న గాయం కూడా లేదు.

"అతనికి ప్రాణగండం తప్పింది. వచ్చింది పెద్ద ఎత్తున గుండెపోటు - హార్ట్ఎటాక్ - బతకాల్సింది కాదు. కానీ అతను బతికాడు."

అతనికప్పుడే స్పృహ వచ్చింది. భార్య కళ్ళల్లోకి చూసిన దాసు కళ్ళలో కన్నీటి పొర చూసి కమల కలవరపడింది. నెమ్మదిగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుని ధైర్యం యిస్తూ ప్రేమగా నిమిరింది.

* * *

దాసు మనసునిండా ప్రశ్నలే బుర్ర పెద్ద కార్ఖానాలా సమ్మెట దెబ్బ లతో బాధాకరంగా తయారైంది. అన్నీ భయాలే అస్తమానూ గుర్తుకొస్తున్న వరహాలు ముఖం అతన్ని మరీ భయపెడుతోంది. మళ్ళీ అంతలోనే అదే ముఖం అభయమిస్తున్నట్లనిపిస్తోంది ఒక్కోక్షణం ఆయోమయంలో కొట్టుమిట్టాడు తున్నాడు.

"మీరేం ఆలోచనలు పెట్టుకోకండి ఆందోళన పడకండి, మీకేం భయం లేదు" అంటూ డాక్టర్లు ధైర్యం చెప్పారు.

ఆ బాంబులు పేలుడులో 198 మంది చచ్చిపోయారు. అంటే 199 అవ్వాల్సింది కానీ ఆ ఊహే అతన్ని దడదడలాడిస్తోంది.

పదిరోజుల్లో ఎన్నెన్నో వార్తలు దాసుని చేరాయి తనకి అత్యంత ముఖ్యమైన పని అప్పగించిన మేనేజరు చనిపోయాడు కంపెనీ కాగితాలు బుగ్గి బూడిదై పోయాయి. తను ?? తను మాత్రం .... అంతకంటే ఆలోచించే స్థితిలో దాసు లేడు. వరహాలు గురించి వాకబు చేద్దామన్నా పిచ్చిభయం అతన్ని ఆవహించి దడదడ లాడించేస్తోంది.

"మీరా సమయానికి కిందకెలా వచ్చారా అన్నదే దైవలీల. నిజంగా ఆ దేవుడే మిమ్మల్ని వెంటబెట్టుకుని తీసుకెళ్ళి రక్షించి వుంటాడు." ఈ మాటలు అతని భార్య సుమారు లక్షసార్లు అని వుంటుంది. ఆ మాటలు విన్నప్పుడల్లా వరహాలు గుర్తుకొచ్చి దాసు మరింత భయపడుతున్నాడే తప్ప, తనకి చావు తప్పినందుకు ఆనందపడలేకపోతున్నాడు.

ఒక్కోక్షణంలో భార్యతో తన భయం, బాధా చెప్పుకుందామనిపించేది దాసుకి. కానీ కమలకి లోకజ్ఞానం తక్కువని అతని భయం. ఈ మాటలు నలుగురి దగ్గిరా అన్నదంటే. ప్రచారమై పెద్ద గొడవైపోతుంది.

అందుకే దాసు పెదవి విప్పలేదు.

బాంబు ప్రేలుడు వార్తలు పేపర్ల నిండా ఫోటోలతో వచ్చేశాయి. ఏవేవో ఊహలు, వార్తలు, రాజకీయ నాయకుల వాగ్దానాలు, పోలీసు బృందాల పరిశోధనలు, ఇలా ఎన్నో -

దాసుని కనీసం రెండు నెలలు బెడ్ రెస్ట్ తీసుకోవాలన్నారు. ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడినవారికీ, ప్రాణాలు పోగొట్టుకున్నవారి కుటుంబాల వారికీ ప్రభుత్వం నష్టపరిహారాలు చెల్లించింది. దాసు అటువైపుకూడా కన్నెత్తి చూడలేదు. కమల మాత్రం గిజగిజలాడింది.

'బతికానుగా - అది చాలదా' అని విసుక్కున్నాడు దాసు.

అతనికొకటే భయం తనని ఎవరేనా ప్రశ్నలతో బాధిస్తే తనేం చెప్పలేడు. తనకేం తెలీదు. ఆ వరహాలు ఎక్కడుంటాడో కూడా తెలీదు. కానీ తెలీదంటే ఎవ్వరూ నమ్మరు. అదే అతని భయం.

'దుర్ఘటన చూసి గుండెపోటు తెచ్చుకున్నవారికేమీ నష్టపరిహారం యివ్వరా' అంటూ వాపోయింది కమల.

ఆ ప్రశ్నకి జవాబు దాసు మౌనమే.

దాసు నెమ్మదిగా లేచి యింట్లో తిరుగుతున్నాడు. విషవాయువు సోకి అకాలంగా మాడిన చెట్టు కొమ్మలా కదులుతున్నాడు. తెల్లగా పాలిపోయి, నీరు లేని మేఘంలా, దూది పింజలా అతను అటూ యిటూ మసులుతున్నాడు. అయినా అతని మనసు నిండా భయం. అదుపు చేసుకోలేని భయం! విపరీత భయం - కబళించబోయిన మృత్యువు కరుణించిన భయం. పిచ్చి కుక్కనుండి తప్పించుకున్నాక కలిగే భయం.

భయం - ఏదో భయం - తనేదో దాస్తున్నాననే భయం. ఏం దాస్తున్నానో తెలీని భయం, తనకేమీ తెలీదనే భయం. ఎవరో దేశద్రోహులు చేసిన దుర్మార్గాన్నుండి ప్రాణాలు కాపాడుకున్న భయం.

అసలు వరహాలు ఎవరు ?

ఏమో,

ఆ క్షణంలో తన్నెందుకు అక్కడ్నించి తప్పించాడు ?

ఏమో ?

అతనిక్కడ చేస్తున్న ఉద్యోగమేమిటి ? వ్యాపారమేమిటి ?

ఏమో ? ఏమో ?

ఏదో చెప్పాడు తనకిప్పుడు గుర్తు రావడంలేదు. కానీ గుర్తు రావడం లేదంటే ఎవరేనా నమ్ముతారా ?

కనీసం కమలకూడా నమ్మదు.

ఒక్కసారి అతన్ని విపరీతమైన నీరసం ఆవహించింది. మంచంమీద వాలిపోయాడు.

కమల గాభరాగా వచ్చింది.

"ఏమైంది ? ఏమిటలా వున్నారు ?

అతనేం లేదని సైగ చేశాడు. దాసు నెమ్మదిగా భార్య ముఖంవైపు చూశాడు. ఆ బొట్టు లేకుండా వుంటే ఆ ముఖం ఎలా వుంటుంది ?

కూతురి ముఖంవైపు చూశాడు. తండ్రిని కోల్పోయిన బాధ గూడుకట్టుకుని వుంటే సుభద్ర ముఖం ఎలా వుంటుంది ?

"ఏమిటి నాన్నా అలా చూస్తున్నావు."

"ఏం లేదు." అతని గొంతు పాతాళంలోంచి పలికింది.

*　　*　　*

దాసుకి ఆరోగ్యం బాగుపడినట్టేగానీ అతనేం చెయ్యలేకపోతున్నాడు. అతని మానసిక రోగానికి డాక్టర్లేం మందులివ్వలేకపోతున్నారు. అతను మానసికంగా దెబ్బతిన్నాడనీ, జడుసుకున్నాడనీ చెప్పారు.

"ధైర్యంగా వుండండి."

"జరిగిపోయిందేమీ ఆలోచించకండి." అని ఎన్నోవిధాల నచ్చచెప్పారు. ధైర్యం చెప్పారు.

దాసుని వెతుక్కుంటూ కంపెనీ యజమాని వచ్చాడు. జబ్బుపడిన దాసుని చూసి ఎంతో బాధపడి, పదివేల రూపాయలిచ్చాడు. మేనేజరు చనిపోయినందు కెంతో బాధపడ్డాడు.

మన కంపెనీలో పనిచేస్తున్న అందరూ చనిపోయారు. ఒక మున్షీరాం కాలూ చెయ్యీపోయి బతికాడు. మిమ్మల్ని ఎవరో వచ్చి బయటకి తీసుకెళ్ళార్టగా. నేను ఊళ్ళో లేను." ఆయన నిట్టూర్చాడు.

దాసు గుండెలు దడదడ లాడాయి.

"నా కోసం ఎవరో వచ్చారని ఎవరు చెప్పారు" అన్నాడు హీనస్వరంతో.

"మున్షీరాం చెప్పాడు. నువ్వొక్కడివే అదృష్టవంతుడివనుకున్నాం."

కాస్సేపుండి ఆయన వెళ్ళిపోయాడు. దాసు మళ్ళీ కుప్పలా కూలిపోయాడు. కమల మాత్రం మహదానందపడిపోయింది. ఈ రోజుల్లోకూడా యిలాంటి మనుషులున్నారని ఆయన్ని పొగిడింది.

దాసులో గాభరా పెరిగిపోయింది. ఇలా ఇలా ఆరా తీయడంలో వరహాలు పేరు వస్తుంది. తనని తీసుకెళ్ళి సి.బి.ఐ. వాళ్ళ చేతుల్లో పడేస్తారు. వాళ్ళు వరహాలు అంటే ఎవరు ? నీ కెప్పటినుంచి తెలుసు ? నువ్వు యింతక్రితం ఎప్పుడు కలుసుకున్నావు ? ఎక్కడ ? అప్పుడేం మాట్లాడుకున్నారు ? -

అలా అలా - లాకప్‌లు, లాఠీలు అతని మనసుని చిత్రవధ చెయ్యడం మొదలుపెట్టాయి.

*　　*　　*

"వరహాలు అంటే ఎవరు ?" అనడిగింది కమల కాఫీగ్లాసు అందిస్తూ -

తాచుపామును ఎవరో మీదికి విసిరినట్లు వులిక్కిపడ్డాడు దాసు. కాఫీ గ్లాసు అందుకున్న చెయ్యి వణికిపోయింది.

"ఏం ? ఎందుకు ?" అన్నాడు.

"ఏం లేదు. రాత్రి చాలాసార్లు మీరు వరహాలు వరహాలు అన్నారు. అందు కని అడిగాను" అంది అతి మామూలుగా.

"ఎవడో మా కంపెనీ కష్టమర్. వాడికి నాకూ ఏమిటి సంబంధం ? ఎప్పుడో వస్తూంటాడు పోతూంటాడు" అన్నాడు మరింత గాభరా పడిపోతూ.

కమల అతని స్థితినేం పట్టించుకోలేదు. దాసులో మళ్ళీ ఆలోచనలు సుళ్ళు తిరగడం మొదలుపెట్టాయి.

వాడు నా ప్రాణం తీయడానికే వచ్చాడు. తనెంత దాచుకుందామన్నా తనే గుండెలో దాచలేకుండా వున్నాడు. అది ఏదో ఒకరోజున భళ్ళున బద్దలవుతుంది. అప్పుడైనా తనకి చావు తప్పదు. తనకి ప్రాణంమీద అంత తీపి లేదు. ఈ బ్రతుకు మీద మమకారమూ లేదు. కానీ ఈ భయాన్ని తట్టుకోగల శక్తిలేదు. ఇంతకంటే చావే నయం. అందరి దృష్టిలో దోషిగా, మాఫియా ముఠాల మిత్రుడిగా అవమానాలు పొంది బ్రతకడం కంటే చచ్చిపోవడమే నయం - ఈవేళ మున్షీ రాం కాకపోతే రేపు మరోడు చెప్తాడు.

"నాన్నా ! అనుమానితుల ఫోటోలు వేశారు. పేపరులో చూశారా" అంటూ సుభద్ర పేపరు తీసుకొచ్చింది.

దాసు ఆత్రంగా బొమ్మలు చూడటం మొదలుపెట్టాడు. ఒక్కొక్క బొమ్మా - అన్నీ వరహాలు ముఖాల్లాగానే కనిపిస్తున్నాయి. కింద ఏవేవో పేర్లు దాసుకి భయంకరమైన గుండెనొప్పి, బరువు, ఊపిరాడని అవస్థ. ఒళ్ళంతా చెమట ముద్ద - ఆయాసం -

"అమ్మా ! అమ్మా ! నాన్నగారిని చూడూ" సుభద్ర గొంతు వినిపించటం క్రమంగా దూరమవుతోంది.

ఎవరో చెరువులో మునిగిపోతుంటే తను వేగంగా ఈదుకుంటూ వెళ్తు వాళ్ళని రక్షించడానికి, - కానీ గుండెల్లో విపరీతమైన నొప్పి. ...."

మొదటి గారి ఎటాక్కే సివియర్‌గా వచ్చింది - సెకండ్ టైము తట్టుకోవడం కష్టమైంది'